మనం
మెదక్ సంగారెడ్డి సిద్దిపేట
శుక్రవారం | 25 | ఆగస్టు | 2023 | పేజీలు : 9



# మన్నించు మల్లన్న స్వామి



-ఆరు బయట పడేసిన కోరమీసాల రాయుడి ప్రతిమలు

-ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

8 లో

# పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

7 లో



# అర్హులకే సంక్షేమ పథకాలు అందాలి

-మంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడికి బీజేపి యత్నం

-అడ్డుకున్న పోలీసులు

-మహిళా నాయకురాళ్ల పట్ల పోలీసుల అత్యుత్సాహం

2 లో



# హుస్నాబాద్ బరిలో పొన్నం..?

- నేడు గాంధీభవన్‌లో దరఖాస్తు
- బీసీలు అత్యధికంగా ఉండటంతోనే పోటీకి సిద్ధం
- పొన్నం అభ్యర్థి అయితే ప్రవీణ్‌రెడ్డి పరిస్థితి ఏంటి
- పొన్నం ఎంట్రీతో మారనున్న రాజకీయ సమీకరణాలు



హుస్నాబాద్,ఆగస్టు 24, (మనం న్యూస్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున హుస్నాబాద్ బరిలో నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్ గౌడ్ సిద్ధమయినట్లు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెల్సిందే. శ్రావణమాసం కావడం మంచి ముహూర్తాలు ఉండటంతో అభ్యర్థులుగా పోటీ చేసేవారు గాంధీ భవన్‌లో దరఖాస్తులకు సిద్ధం అవుతున్నారు. ఈ సారి కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో వచ్చిన జోష్ కావచ్చు, అధికార పార్టీ పై ప్రజల్లో వ్యతిరేకత కావచ్చు కానీ కాంగ్రెస్ నాయకులు ఈ సారి ఎన్నికల బరిలో నిల్చుండి తమ లక్కును పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసారు. ఇప్పటికే ఏఐసీసీ, పీసీసీ ఆఫీసులు ఉన్నాయని చెప్పుకుంటున్న లీడర్లు కూడా పీసీసీ ఆదే శాల మేరకు గాంధీభవన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ సారి ఎన్నికల బరిలో నిలిపేందుకు గెలుపు గుర్రాలను కాంగ్రెస్ పార్టీ గుర్తించేందుకు దరఖాస్తులు తర్వాత వడపోత కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఇప్పటికే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సర్వే టీంలను కూడా రంగంలోకి దించి సర్వే చేయించి సంబంధిత నివేదికల ఆధారంగా టికెట్ల కేటాయింపు చేయాలని నిర్ణయించారు. దీంతో హుస్నాబాద్ నియోజకవర్గం నుండి అసెంబ్లీలో పోటీ చేసేందుకు కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ నేడు

మిగతా 2లో..



## కులవృత్తులను ప్రోత్సహిస్తాం



సిద్దిపేట రూరల్, ఆగస్టు 24, మనం న్యూస్ః తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులకు పెద్దపీట వేస్తుందని, కులవృత్తులను ప్రోత్సహిస్తామని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు అన్నారు. గురువారం పట్టణం లోని నాయిబ్రాహ్మణ, న్యూ నాయిబ్రాహ్మణ సేవా సంఘాలు మున్సిపల్ ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సిద్దిపేటలో ఇతర మతస్తులు, ఇతర కులస్తులు సెలూన్ షాపు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నారని, వారికి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని విన్నవించారు. దీనికి ఆయన స్పందిస్తూ మున్సిపల్ కమీషనర్‌తో, వన్‌టౌన్ సిఐతో ఈ అంశంపై చర్చించి మాట్లాడారు. మంత్రి హరీష్‌రావు దృష్టికి కూడా తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వజీర్, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధక్షులు కోత్వాల్ యాద నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మొలంకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో టిఎన్‌జిఓ ముందుంటుంది



సిద్దిపేట, ఆగస్టు 24, మనం న్యూస్ ప్రతినిధిః ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడానికి ఉద్యోగస్తులందరూ కృషి చేస్తున్నారని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. గురువారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యోగులు ఎంతో కష్టపడి జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచి దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. ఉద్యోగులకు ఏ సమస్యలు వచ్చినా ఆ సమస్యల పట్ల చొరవ తీసుకొని పరిష్కారం అయ్యే విధంగా టిఎన్‌జిఓ సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. గత 75 సంవత్సరాల నుండి ఈ సంఘం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోమండ్ల విక్రంరెడ్డి, సహాధ్యక్షులు నిమ్మ సురేందర్‌రెడ్డి, కోశాధికారి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి శంఖారావంలో పస లేదు

### సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షులు అత్తు ఇమామ్



సిద్దిపేట రూరల్, ఆగస్టు 24, మనం న్యూస్ః సీఎం కేసీఆర్ మెదక్‌లో నిర్వహించిన ప్రగతి శంఖారావం సభలో సీఎం కేసీఆర్ మాటల్లో ఎలాంటి పస లేదని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సభలో కొత్త పథకాలు ఏవైనా తీసుకువస్తారేమోనని ప్రజలు ఎదురు చూశారని, కానీ సీఎం కేసీఆర్ మాత్రం అందుకు విరుద్ధంగా పాత పథకాలు చదువుతూ పాత ముచ్చట్లు చెప్పాడే తప్ప కొత్త విషయాలేవీ చెప్పలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో బిఆర్ఎస్ ఓటమి ఖాయమనే భయం కేసీఆర్ మాటల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఆ భయంతోనే టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారన్నారు. నేడు రాష్ట్ర ప్రజలు సీఎం కేసీఆర్ మాటలు నమ్మే స్థితిలో లేరని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇంత వరకు సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, కాంగ్రెస్ అదికారంలోకి రాగానే ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయసుద్దీన్, నాయకులు రాకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ బరిలో పొన్నం..?

మొదటి పేజీ తరువాయి..

గాంధీభవన్‌లో దరఖాస్తు చేస్తున్నారు.

### పొన్నం రాజకీయ ప్రస్థానం.......

1987-88 లో ఎస్.ఆర్.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ, పీజీ కళాశాలలో చదువుకునే రోజుల్లోనే విద్యార్థి నాయకుడిగా యూనియన్ అధ్యక్షుడయ్యాడు. 1987-89 లో ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించాడు. 1999-2002 లో మధ్య కాలంలో ఎన్.ఎస్.యు.ఐ.రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మార్క్ఫెడ్ ఛైర్మన్‌గా పొన్నం ప్రభాకర్ గౌడ్ పని చేసారు. భారత జాతీయ కాంగ్రెస్ తరుపున కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి 2009 - 2014 మధ్య 15 వ లోక్‌సభకు పార్లమెంట్ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించాడు. ఎంపీలలో పొన్న ప్రభాకరే చిన్న వయస్కుడు. తెలంగాణలోని నాయకులలో ఒకరిగా ఉన్న పొన్నం ప్రభాకర్ విద్యార్థి ఉద్యమకారుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. పొన్నం ప్రభాకర్ 2022 లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నియమితుడయ్యాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వారిలో పొన్నం ఒకరు. పొన్నం ప్రభాకర్ పెప్పర్ స్ప్రేకు గురైనడంటూ ఇప్పటికి పేరుంది.

### పొన్నమా..అల్గిరెడ్డినా..?

హుస్నాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఇద్దరిలో ఏవరిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తారో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వేచి చూస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు పార్టీకి, కార్యకర్తలకు అండగా ఉన్న పొన్నంకు సపోర్ట్ చెద్దామా...అల్గిరెడ్డికి సపోర్ట్ చెద్దామా అన్న చందంగా కాంగ్రెస్ కార్యకర్తల పరిస్థితి నెలకొంది. కాగా హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కొంత కాలంగా తమ క్యాడర్‌తో కలిసి నియోజకవర్గంలోని అన్ని మండలాలను చుట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో బిసి సామాజిక వర్గం ఎక్కువ మొత్తంలో ఉండటంతో కాంగ్రెస్‌లో తలపండిన నేతగా పేరున్నది. బిసి బిడ్డ కరీంనగర్ పార్లమెంట్ మాజీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ గౌడ్ హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దించేందుకు కాంగ్రెస్ అధిష్టానం సంసిద్ధమయినట్లు ప్రచారం జరుగుతుంది. అయితే పొన్నం ప్రభాకర్ సదరు స్థానానికి దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం కావడం పార్టీలో పెద్ద దుమారం లేచే అవకాశాలు ఉన్నాయి. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న బిసి నాయకుడు కష్టాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీని అన్నీ తానై వ్యవహరించిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పార్టీని వీడటంతో పార్టీలో బీసీ నాయకులు నిరుత్సాహంతో ఉండటంతో బీసీ నేతగా మళ్లీ పొన్నం రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలో జోష్ నిండనుంది.

### బీసీలు అత్యధికం.......

హుస్నాబాద్ నియోజకవర్గంలో అత్యధిక బీసీ ఓట్లు ఉన్నాయి. అంతే కాకుండా గౌడ సామాజిక వర్గానికి చెందిన గౌడ కులస్తుల ఓట్లు సుమారు 25 వేలు ఉన్నాయి. మున్నూరు కాపు, గౌడ సామాజిక వర్గం బలంగా ఉన్న ఈ నియోజకవర్గంలో దేశిని చిన్నమల్లయ్య నాలుగు సార్లు సీపీఐ అభ్యర్థిగా గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బొమ్మ వెంకటేశ్వర్లు(వెంకన్న) ఒకసారి గెలుపొందారు. అప్పటి నుండి ఇప్పటి వరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో బిసి అభ్యర్థిగా ఏవరూ పోటీ చేయలేదు. ఈ సారి మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గం నుండి బిసి సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ గౌడ్ ఇక్కడ పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో బీసీల్లో సానుకూలత వ్యక్తమవుతున్నదని చెబుతున్నారు. కరీంనగర్ నుండి పోటీ చేయడం కంటే హుస్నాబాద్‌లో పోటీ చేస్తేనే విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పొన్నం భావిస్తున్నారు.

### నేటి నుండి హుస్నాబాద్‌లో మకాం.............

హుస్నాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్దమైన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ నేటి నుండి హుస్నాబాద్‌లో మకాం వేసేందుకు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే స్థానిక నాయకులతో ఆయన చర్చించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని ఉంటూ ప్రచారం మొదలుపెట్టనున్నట్లు సమాచారం. ఢిల్లీ పెద్దలతో పొన్నం మంతనాలు జరిపి నాకు హుస్నాబాద్ అసెంబ్లీ ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని ఆయన అడిగినట్లు అనుచరులు తెలుపుతున్నారు. ఒక వేళ పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ప్రకటిస్తే మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి దారేటు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.




## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు సామాగ్రి అందజేత

చిన్నకోడూరు, ఆగస్టు 24, మనం న్యూస్ః లయన్స్ క్లబ్ సిద్దిపేట వారి ఆర్థిక సహాయంతో చిన్నకోడూరు మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టీల్ గ్లాసులు, పంచాయతీ కార్మికులకు డ్రెస్సులు, చీరలు పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాలలో 165 మంది విద్యార్థులకు అంబలి తాగేందుకు స్టీల్ గ్లాసులు పంపిణీ చేసి లయన్స్ క్లబ్ వారు సమకూర్చిన ఫ్రూట్ జ్యూస్‌ను విద్యార్థులకు అందించారు. అదేవిధంగా పలువురు పారిశుద్ధ్య కార్మికులకు డ్రెస్సులు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛ భారత్‌పై వ్యాసరచన, డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్లా షరీఫ్, ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, రవిందర్‌రెడ్డి, రాములు, వాణి, దేవకి తదితరులు పాల్గొన్నారు.




## అర్హులకే సంక్షేమ పథకాలు అందాలి




సిద్దిపేట, ఆగస్టు 24, మనం న్యూస్ ప్రతినిధిః బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే కాకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదంటూ డిమాండ్ చేస్తూ గురువారంనాడు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మంత్రి హరీష్‌రావు క్యాంపు కార్యాలయ ముట్టడికి ప్రయత్నించారు. మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి ఒక్కరోజు ముందే పిలుపునివ్వడంతో పోలీసులు అందుబాటులో ఉన్న నాయకులను ఒకరోజు ముందుగానే అరెస్ట్ చేశారు. గురువారం నాడు ఉదయం 11 గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని బీజేపి కార్యాలయం నుండి ర్యాలీగా మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి వస్తుండగా పోలీసులు వారిని బీజేఆర్ సర్కిల్‌లోనే అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. అయినా కొంతమంది నాయకులు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. మహిళా నేతలు కొందరు అనూహ్యంగా ఆటోలో వచ్చి ఒక్కసారిగా మంత్రి క్యాంపు కార్యాలయం లోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. మహిళా నేతలు క్యాంప్ కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్తున్న క్రమంలో అక్కడ ఉన్న మహిళా పోలీసులు తక్కువగా ఉండడంతో పోలీసులే వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో మహిళా నేతలను మీరెలా అడ్డుకుంటారంటూ కాసేపు వాగ్వాదానికి దిగారు. మహిళా నేతలు క్యాంపు కార్యాలయ ముట్టడికి ప్రయత్నిస్తున్నారన్న విషయం తెలుసుకున్న మరికొంత మంది మహిళా పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిజమైన నిరుపేదలకు ఎంతమాత్రం విలువ ఇవ్వడం లేదని, పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందిస్తుందంటూ మండిపడ్డారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి డబుల్ బెడ్‌రూమ్‌లు, బిసి బంధు అందించాలని, లేనిపక్షంలో రాబోయే కాలంలో కార్యక్రమాలను మరింతగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దళితబంధు, గృహలక్ష్మి పథకాల దరఖాస్తుల్లోనూ పక్షపాతం వహిస్తున్నారని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పత్రి శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చొప్పదండి విద్యాసాగర్, గుండం లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ మూడవసారి ముఖ్యమంత్రి కావాలి



**-మల్లన్నకు ముడుపు కట్టిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి**

**-భారీ బైక్ ర్యాలీతో వచ్చిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు**

**-జనగామ టికెట్ ముత్తిరెడ్డికి కేటాయించాలని ర్యాలీ**

కొమురవెల్లి, ఆగస్టు 24, మనం న్యూస్ః కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయం వద్ద గంగరేని చెట్టుకు గురువారం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మూడవసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని మల్లన్నకు ముడుపు కట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, కేసీఆర్ నాకత్వంలో అన్ని జిల్లాల్లోని మండలాల్లో, గ్రామాల్లో అభివృద్ధి సాగిందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకు ఏదో ఒక రూపంలో అందుతున్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు మరోసారి బిఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌ను మూడవసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. జనగామ నియోజవర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలు తనను గెలిపించుకున్నారని, ఇక్కడి ప్రజలకు ఎంత అభివృద్ధి జరిగిందో అందరికి తెలుసన్నారు. కానీ కొంతమంది దుష్టశక్తులు కేసీఆర్‌కు తనపై తప్పుడు విషయాలు చెబుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో తాను చేసిన అభివృద్ధి అంతా సీఎం కేసీఆర్‌కు తెలుసునని, కాబట్టి ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా సరే అన్నారు. గతంలో కూడా తనపై ప్రతిపక్ష పార్టీలు ఎన్నో ఆరోపణలు చేశాయని, అవన్నీ పట్టించుకోకుండా రెండుసార్లు పార్టీ టికెట్ ఇచ్చి నియోజకవర్గానికి పంపిస్తే స్థానిక ప్రజలు నన్ను భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. కాబట్టి అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ కో ఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డి, జెడ్పిటిసి మల్లన్న ఆలయ ఛైర్మన్ గీస బిక్షపతి, ఆలయ డైరెక్టర్ రఘువీరారెడ్డి, చేర్యాల ఏఎంసి ఛైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నిమ్మ రాజీవ్, ఎంపిపి తలారి కీర్తన కిషన్, చేర్యాల ఎంపిపి కర్ణాకర్, బిఆర్ఎస్ నాయకులు మేక సంతోష్, మంద యాదగిరి, కొమురవెల్లి మండల తెరాస కార్యకర్తలు, నాయకులు పుట్ట కనకరాజు, మెరుగు స్వామి, పచ్చిమడ్ల స్వామి, తాళ్లపల్లి లింగం, సర్పంచ్‌లు కర్ణాకర్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## మల్లన్న సాగర్‌ను సందర్శించిన

# నాగాలాండ్ ఐఏఎస్ అధికారులు

### వివరాలు తెలిపిన ఎస్ఈ వేణు

తొగుట, ఆగస్టు 24, మనం న్యూస్ః తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో నిర్మించిన మల్లన్న సాగర్ ప్రాజెక్టును గురువారం నాగాలాండ్ ఐఏఎస్ అధికా రుల బృందం సందర్శించారు. ఫీల్డ్ ఎక్స్‌పోజర్ అండ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా రాష్ట్రంలో అభివృద్ధి చేసిన నీటి పారుదల వ్యవస్థను అధ్యయనం చేయడంలో భాగంగా నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన 20 మంది ఐఏఎస్ అధికారుల బృందం మల్లన్న సాగర్‌ను సందర్శించినట్లు అధికారులు ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు విశేషాలు, గోదవరి నుండి నీటిని ఎత్తిపోసేందుకు నిర్మించిన లిఫ్టల శ్రేణి, ఇందులోని పంప్‌హౌజ్‌లు, సొరంగాలు, కాలువల వంటి తదితర అంశాలను వారికి ఎస్ఈ వేణు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రష్ట్రంలో ఆయకట్టుతోపాటు తాగునీటి వ్యవస్థ, భూగర్భ జలాల మట్ట పెరగడం, వ్యవసాయ ఉత్పత్తిలో వృద్ధికి కారణమైన గోదావరి నీటితోట్యాంకుల పోషణ గురించి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ పద్ధతి, వ్యయం, భూ సేకరణ, భూములకు పరిహారం వంటి విధానాల గురించి ఉన్న సందేహాలను తెలుసుకోవడానికి ఆసక్తి కనబరిచారు. రిజర్వాయ ర్‌లో పెరుగుతున్న చేపలు, ఆక్వాకల్చర్‌తోపాటు ప్రాజెక్టు గురించి ఇతర వివరాలు స్థానికుల నుండి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు పరిశీలన ద్వారా తాము ఎన్నో విషయాలు నేర్చుకున్నామని, తెలంగాణ రాష్ట్రంలో అవలంభిస్తున్న విధానాలను గుర్తించామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్లు ఎస్ఈ వేణు, ఈఈ వెంకటేశ్వర్‌రావు, డిఈఈ శ్రీనివాస్ ఉన్నారు.







## ఉన్నత పాఠశాలలో చంద్రయాన్- 3

# విజయోత్సవ సంబరాలు



తొగుట, ఆగస్టు 24, మనం న్యూస్ః చందమామపై భారత్ చెరగని ముద్ర వేసింది. చారిత్రక ఘట్టంతో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సరికొత్త చరిత్రను లిఖించింది. ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తుండగా కోట్లాది భారతీయుల ప్రార్థనలు ఫలించగా చంద్రయాన్ – 3 విజయవంతమైన సందర్భంగా గురువారం తొగుట మండల కేంద్రంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వీట్లు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ రోదసీరంగంలో భారతదేశం అత్యున్నతమైనటువంటి మైలురాయిని చేరుకుందని, ప్రపంచంలోని అగ్రరాజ్యాల స్థాయికి చేరుకొని భారతదేశం తన సత్తా చాటిందని, చంద్రునిపై విక్రమ్ ల్యాండర్‌ను అత్యంత చౌక ఖర్చుతో పంపిన మన శాస్త్రవేత్తల కృషి చాలా గొప్పదని, వారి స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పంఎపొందించుకోవడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భగవాన్, మనోజ్, శ్రీపాల్, మురళీధర్, మల్లేశం, రామచంద్రం, సుఖేందర్‌రెడ్డి, కాత్యాయని దేవి, ఆంజనేయులు, జి. శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి



నంగునూరు, ఆగస్టు 24, మనం న్యూస్ః రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో రైతులకు సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్లు పంపిణీ చేసి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఆరుతడి పంటలను ప్రోత్సహించడానికి సబ్సిడీపై స్ప్రింక్లర్లను అందిస్తుందన్నారు. మంత్రి హరీష్‌రావు సహకారంతో మండల వ్యాప్తంగా 90 శాతం సబ్సిడీపై ఈ ఏడాది 252 మందికి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంగ కుమార్, మాజీ ఏఎంసి ఛైర్మన్ రాగుల సారయ్య, ఆయిల్‌పామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, రైతుబంధు అధ్యక్షులు కిష్టారెడ్డి, నాయకులు కోల రమేష్ గౌడ్, రాజు గౌడ్, వెంకట్‌రెడ్డి, పరమేశ్వర్, వేణు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



## మానవహారంతో సెకండ్ ఏఎన్ఎంల నిరసన

### ఏఎన్ఎం నోటిఫికేషన్ ప్రతుల దగ్ధం




సిద్దిపేట అర్బన్, ఆగస్టు 24, మనం న్యూస్ః తమ డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె గురువారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు ఏఐటి యుసి నాయకులతో కలిసి స్థానిక బిజేఆర్ చౌరస్తా వద్ద మానవహారంగా నిలబడి నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు అనేక సేవలు అందించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని మూడవ స్థానంలోకి తీసుకువచ్చామన్నారు. ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్న తమను పర్మినెంట్ చేయాలని, ఏఎన్ఎంల భర్తీక ఇచ్చిన నోటిఫికేషన్‌లు రద్దు చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటి యుసి నాయకులు, సెకండ్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# మల్లన్నను దర్శించుకున్న కర్ణాటక బీజేపి ఎమ్మెల్యే

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు

కొమురవెల్లి, ఆగస్టు 24, మనం న్యూస్ః కొమురవెల్లి మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ మల్లికార్జున స్వామి వారిని కర్ణాటక రాష్ట్ర తీర్థహళ్లి ఎమ్మెల్యే సిద్దు సవాడి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల కోసం బీజేపి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి బీజేపి నుండి ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలు పర్యటించే విధంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విచ్చేసామన్నారు. నియోజకవర్గంలో బీజేపి నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్ గౌడ్, జనగామ జిల్లా ఉపాధ్యక్షులు బెజాడ బీరప్ప, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, దండాల లక్ష్మారెడ్డి, ఎక్కల్దేవి మధు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.







# ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

### కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

తొగుట, ఆగస్టు 24, మనం న్యూస్ః పొలం పనులు చేస్తుండగా దాహం వేయడంతో తాగడానికి మంచినీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మరణించిన సంఘటన తొగుట మండలంలోని కాన్గల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. తొగుట పోలీసులు తెలిపిన కథనం ప్రకారం గ్రామానికి చెందిన మహిళా రైతు కర్రోల్ల ఎల్లవ్వ (52) ఎప్పటిలాగే తన వ్యవసాయ పొలం పనుకు వెళ్లింది. తాగడానికి నీళ్ల కోసం పక్కనే ఉన్న మల్లేశం వ్యవసాయ పొలంలోని బావి వద్ద బోరు నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు పైప్ విరిగిపోవడంతో బావిలో పడింది. ఎల్లవ్వకు ఈత రాకపోవడంతో అక్కడే మరణించింది. ప్రమాద విషయం తెలియడంతో పక్కనే ఉన్న వారు వెళ్లి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. ఎల్లవ్వ భర్త ఐలయ్య రెండేళ్ల క్రితం, మనువడు అనిల్ (14) నెల క్రితం ఉరి వేసుకొని మరణించగా నేడు ప్రమాదవశాత్తు ఎల్లవ్వ మరణంతో వారి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. అనంతరం సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరతలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి





బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ దోమల కొమురయ్య, సర్పంచ్‌ల ప్రేమల చంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కంకణాల నర్సింలు, నాయకులు ప్రశాంత్, రాజిరెడ్డి, కర్నాకర్, స్వామి, వార్డు సభ్యులు తదితరులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



చేర్యాల, ఆగస్టు 24, మనం న్యూస్ః విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన హైదరాబాద్‌లోని సూరారంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మం డల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన కడారి రామస్వామి (37) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని రసూల్‌పురాలో నివాసముంటూ సూరారంలోని ఓ వైన్స్‌లో తినుబండారాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆ వైన్స్ ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫెన్సింగ్‌కు ఉన్న ప్లెక్సీని తీస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడిపోగా వెంటనే గమనించిన స్థానికులు అంబులెన్స్ ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రామస్వామి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

## సింహగర్జన యూత్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షులుగా లింగాల సదానందరెడ్డి



మిరుదొడ్డి, ఆగస్టు 24, మనం న్యూస్ః మిరుదొడ్డి మండల కేంద్రంలో సింహగర్జన యూత్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షునిగా లింగాల సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఆంజనేయులు, కోశాధికారిగా కవిరాజ్, ఉపాధ్యక్షులుగా అంజి, హరీష్, నరేష్, ధృవనేష్‌లను కార్యవర్గ సభ్యులుగా అజయ్, సుధాకర్, పర్శరాములు, అనిల్, గోపి, శ్రీకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సింహగర్జన యూత్ అధ్యక్షులు లింగాల సదానందరెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి తనను ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు యూత్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సారి జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.



## ఎంపి ప్రభాకర్‌రెడ్డిని సన్మానించిన మండల ప్రజాప్రతినిధులు

మిరుదొడ్డి, ఆగస్టు 24, మనం న్యూస్ః దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థిగా కొత్త ప్రభాకర్‌రెడ్డి పేరు ప్రకటించినందుకు గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి మిరుదొడ్డి మండల ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి ఎంపి ప్రభాకర్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో లక్ష మెజార్టీ పై చిలుకుతో దుబ్బాక ఎమ్మెల్యే బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుందామని ధీమా వ్యక్తం చేశారు.

# అసంపూర్తి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వెంటనే పూర్తి చేయాలి

## నిరుపేదలకు బిఆర్ఎస్ ఒరగబెట్టింది ఏమీ లేదు

### టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి




మిరుదొడ్డి, ఆగస్టు 24, మనం న్యూస్‌: అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేయాలని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల చెప్యాల, లింగుపల్లి గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తూ తహసీల్దార్ గోవర్ధన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి నిరుపేదలకు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. బీజేపి ఎమ్మెల్యే రఘునందన్ రావు, బిఆర్ఎస్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేండ్లు గడుస్తున్నప్పటికీ మిరుదొడ్డి మండలంలో డుబుల్ ఇండ్లు నిరుపేదలకు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అల్వాల చెప్యాల చౌరస్తా, మల్లుపల్లి, మోతె, భూంపల్లి గ్రామాల్లో నిరుపేదలకు పంచిన దాఖ లాలు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా తూతూ మంత్రంగా అమలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం జరుగుతుందన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ ఇండ్లు వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడుతామన్నారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి బిఆర్ఎస్, బీజేపి పార్టీలకు గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఇతర పార్టీల వల్ల జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు భూపాల్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కాసులాబాద్ రాజు, జోగ్గారి భాస్కర్, వెంకట్‌గౌడ్, కనకారెడ్డి, గుట్టల్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం



మిరుదొడ్డి, ఆగస్టు 24, మనం న్యూస్‌: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మిరుదొడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం అన్నారు. గురువారం మిరుదొడ్డి మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మాదూరి నరేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పంజాల వెంకట్ గౌడ్, జనరల్ సెక్రటరీగా స్వామి, ఎస్సీ విభాగంగా రాంచంద్రం, ఓబిసి అధ్యక్షులుగా శ్రీను, పర్శరాములు, యూత్ అధ్యక్షులుగా నాగభూషణం, మీడియా ఇంచార్జ్‌గా సత్యానార యణ, బూత్ లెవల్ ఏజెంట్‌గా బాల్‌రాజుతోపాటు తరుణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు రాజేశం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కంకణబద్ధులై పని చేయాలని సూచించారు. బిఆర్ఎస్, బీజేపి పార్టీలు ఒరగబెట్టింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పితే బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్యాల రాజు, రాజయ్య, స్వామి, అశోక్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి


### కెనరా బ్యాంక్ మేనేజర్ హరీష్




నంగునూరు, ఆగస్టు 24, మనం న్యూస్‌: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కెనరా బ్యాంకు మేనేజర్ అన్నారు. పాలమాకుల, రాజ్‌గోపాల్‌పేట, బద్దిపడగ పాఠశాలల్లో చదిదే 6, 7, 8వ తరగతిలోని ఆరు మంది ఎస్సీ విద్యార్థులకు కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ. 2500 చొప్పున ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనాన్ని అందించారు. ప్రతి విద్యార్థి కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగినపుడే వారి తల్లిదండ్రులకు, విద్యను బోధించిన ఉపాధ్యాయులకు మంచిపేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతోపాటు కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## డైనోసార్ పార్కులో అగ్ని ప్రమాదం

### -అగ్నికి ఆహుతైన డైనోసార్ ప్రతిమ



సిద్దిపేట, ఆగస్టు 24, మనం న్యూస్ ప్రతినిధిః సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు పరిధిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డైనోసార్ పార్కులో గురువారం ప్రమాదవశాత్తు మంటలు ఎగిసి ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణాలేంటనే విషయం పూర్తిగా తెలియరానప్పటికీ మంటలు తీవ్రంగా వ్యాపించడంతో పార్కు ఎంట్రన్స్‌లో ఏర్పాటు చేసిన డైనోసార్ ప్రతిమ కాలిపోయింది. అయితే కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయడం మూలంగానే ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

### మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నా




దుబ్బాక, ఆగస్టు 24, మనం న్యూస్‌: మున్సిపల్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఆధ్వర్యంలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని దుబ్బాక మున్సిపల్ కార్మికులు, వాటర్ మెన్‌లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు పదిహేనేళ్లుగా తాము పని చేయడం జరుగుతుందని, ఆగస్టు 31 వరకు శాంతియుత నిరసనలు తెలుపుతామన్నారు. మున్సిపల్‌లో పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయని యెడల రాష్ట్ర ఔట్‌సోర్సింగ్‌జేఏసి పిలుపు మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ప్రవీణ్, దిలీప్, రాజయ్య, నర్సయ్య, మల్లేశంతోపాటు, మహిళా పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

### టిపిటిఎఫ్ కార్యవర్గ సభ్యులు పొన్నమల రాములు



మిరుదొడ్డి, ఆగస్టు 24, మనం న్యూస్‌: ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని టిపిటిఎఫ్ కార్యవర్గ సభ్యులు పొన్నమల రాములు కోరారు. గురువారం అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని మోతె, చిట్టాపూర్, భూంపల్లి , ఖాజీపూర్, వీరారెడ్డిపల్లి, జంగపల్లి, మాదన్నపేట, అక్బర్‌పేట, రామేశ్వరంపల్లి, నిజాంపేట, ఎనగుర్తి, పోతారెడ్డిపేట్, తాళ్లపల్లి, నగరం గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో బడ్జెట్‌కు 12 శాతం నిధులు కేటాయిస్తే తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగానికి కేవలం ఆరుశాతం నిధులు మాత్రమే కేటాయించి బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. 8 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల ప్రమోషన్‌లు, ఆరేళ్లుగా బదిలీలు నిర్వహించకపోవడంతో చాలా ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్‌ల ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో కనీస వసతులు కల్పిస్తూ ప్రతి పాఠశాల సర్వీస్ పర్సన్‌లను నియమించాలని కోరారు. లేనిపక్షంలో టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు సతీష్‌రెడ్డి, మల్లేశం, శివాజీ, రాములు, నాగరాజు, రాములు, చంద్రం, మహేష్ ఉన్నారు.

# వేడెక్కిన నీలం మధు రాజకీయం



-ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాల్సిందే

-నీలం మధుకు అనుచరగణం భరోసా

-వేలాదిగా తరలివచ్చిన అభిమానులు

-కార్యకర్తల నిర్ణయం ప్రకారం ముందుకెళ్తా: నీలం మధు

పటాన్‌చెరు, ఆగస్టు 24, మనం న్యూస్‌ః పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ టికెట్‌ను నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించకపోవడం పట్ల నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. నీలం మధుకు మద్ధతుగా అభిమానులు, సబ్బండ వర్గా వారు, యువత పెద్ద తరలివచ్చి నీలం మధుకు టికెట్ కేటాయించకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని గొంతెత్తారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని ఎన్ఎంఆర్ యువసేన కార్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల అభిప్రాయ సేకరణ విస్తృత స్థాయి సమావేశానికి అభిమానులు, సబ్బండ వర్గాల ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా వారు మీ వెంటే మా పయనం... నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నీవు ఎమ్మెల్యేగా పోటీ చేయాల్సిందేనని వారంతా మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. తామంతా స్వచ్ఛందంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని, ఇంటింటికి తిరిగి స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించుకుంటామని తేల్చి చెప్పారు. ముందుగా చంద్రయాన్ – 3 విజయం పట్ల శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ జాతీయ గీతం ఆలపించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలం మధు ముదిరాజ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉండాల్సిందే అంటూ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడాలని తనవంతుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ నారాయణరెడ్డి కోటి రూపాయల సహాయాన్ని ప్రకటించారు. కుల మత భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో ముందుకు కదిలి నీలం మధుకు అండగా ఉండి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగానే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు తలపెట్టామని, అవి ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని, ఎక్కడికి వెళ్లినా మధు అన్నను గెలిపించుకుంటామని తీర్మానాలు చేస్తున్నారరన్నారు. త్వరలోనే ఒక మంచి నిర్ణయం తీసుకొని అందరి సహకారంతో ముందుకు సాగుతామన్నారు. ప్రజలకు సేవ చేసే నాయకుడిని ఎప్పుడూ వదులుకోబోరని ఆ ధీమాతోనే ముందుకు వెళ్తున్నానన్నారు. ప్రజల మనిషిగా ప్రజల భాగస్వామ్యంతో ప్రజల సహకారంతోనే ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యకర్తల, అభిమానుల నిర్ణయానికి అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ తెలియజేస్తానన్నారు. బిసిలకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా బిసిలందరూ గుర్తించారని, రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గంలో ఒక్కరికి ఎమ్మెల్యే సీటు కేటాయించకపోవడం దారుణమన్నారు. గత నాలుగేళ్లుగా పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ ప్రజలకు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ పటాన్‌చెరు టికెట్ విషయంలో పునరాలోచించాలన్నారు. తనకు రాష్ట్ర వ్యాప్తంగా బిసి వర్గాల నుండి అపూర్వ స్పందన లభిస్తుందని, రాష్ట్ర బిసి నాయకులు స్వచ్ఛందంగా గ్రామగ్రామాన వాలంటీర్లు ఏర్పాటు చేసుకొని గెలుపు దిశగా ముందుకు సాగుతాని ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. ఇంతటి అభిమానం చూపిస్తున్న మీ అభిమానం వెలకట్టలేనిదన్నారు. బిసి బిడ్డగా ఎప్పుడూ మీకు అందుబాటులో ఉండి మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం, రజక సంఘం, పద్మశాలి సంఘం, యాదవ సంఘం, గౌడ సంఘం, లింగాయత్ సంఘం, వడ్డెర సంఘం, ముస్లిం మైనార్టీ సోదరులు, రెడ్డి సంఘం, మహిళలు, ఇతర కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి మీసం దరఖాస్తు

### కార్యకర్తలతో జిల్లా కేంద్రంలో ర్యాలీ

### అవకాశం ఇవ్వాలంటూ అభ్యర్థన



సిద్దిపేట, ఆగస్టు 24, మనం న్యూస్ ప్రతినిధిః సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలంటూ చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మీసం నాగరాజు గురువారంనాడు గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉంటూ సేవ చేస్తున్నానని, యాదవ సామాజిక వర్గానికి చెందిన జనాభా నియోజకవర్గంలో అధికంగా ఉన్నందున తన దరఖాస్తును పరిగణలోకి తీసుకోవాలని కోరారు. మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహా , సంగారెడ్డి శాసనసభ్యులు జగ్గారెడ్డిల శిష్యుడిగా పేరున్న మీసం నాగరాజు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుతో ప్రజలు వేసారిపోయారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ముమ్మాటికీ ఖాయమన్నారు. పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నాయకత్వం, కాంగ్రెస్ మేనిఫెస్టో ఈసారి పార్టీని అధికారంలోకి తీసుకురావడం ఖాయమన్నారు. సబ్బండ వర్గాలు ఏకమై ఉద్యమం చేసి తెలంగాణ సాధిస్తే నేడు ఒక్క కుటుంబమే కోట్ల రూపాయల ఆస్తులను కూడగట్టుకొని దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు చెల్లించనున్నట్లు ఇప్పటికే కాంగ్రెస్ హై కమాండ్ ప్రకటించిందన్నారు. దరఖాస్తు దాఖలుకు మీసం నాగరాజు వెంట మీసం మహేందర్, సందెబోయిన పర్శరాములు, బైరి సాయికుమార్, ఉడుత జయంత్, కల్లూరి నర్సయ్య, ప్రశాంత్ తదితరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

# అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### జిహెచ్ఎంసి కార్పోరేటర్లు, అధికారులతో సమీక్ష సమావేశం

పటాన్‌చెరు, ఆగస్టు 24, మనం న్యూస్‌ః పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. పటాన్‌చెరు పట్టణంలోని ఎంపిపి సమావేశ మందిరంలో జిహెచ్ఎంసి కార్పోరేటర్లు, బల్దియా అధికారులతో కలిసి అభివృద్ధి పనులు పురోగతిపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలోని భారతినగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కోట రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఇటీవల మూడు డివిజన్‌ల పరిధిలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.22 కోట్లు నిధులు కేటాయించామన్నారు. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం





తోపాటు బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని ఆదేశించరు. అదేవిధంగా పెండింగ్ నిదుల మంజూరు, నూతన అభివృద్ధి పనుల నిధుల కోసం త్వరలోనే మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో సమావేశం కానున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై విద్యుత్ దీపాల నిర్వహణ సంతృప్తికరంగా లేదంటూ సంబంధిత శాఖ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన కాలనీ పారిశుద్ధ్య నిర్వహణకు నూతన సిబ్బందిని నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పోరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నరేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ విజయ్‌కుమార్, జోనల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజనీరింగ్ శాఖ ఈఈ శంకర్ నాయక్, డిప్యూటీ కమీషనర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు సిద్దిపేటకు మంత్రి హరీష్‌రావు

-అభ్యర్థిగా ప్రకటన అనంతరం తొలిసారిగా

-ఘన స్వాగతం పలికేందుకు బిఆర్ఎస్ శ్రేణుల ఏర్పాట్లు



సిద్దిపేట, ఆగస్టు 24, మనం న్యూస్ ప్రతినిధిః రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మరోమారు సిద్దిపేట అభ్యర్థిగా హరీష్‌రావు పేరును కేసీఆర్ ప్రకటించడంతో సిద్దిపేటలో అభిమానులు, కార్యకర్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇప్పటికే డబుల్ హ్యాట్రిక్ విజయాలతో రికార్డు మెజార్టీని సొంతం చేసుకున్న మంత్రి హరీష్‌రావును ఏడవ సారి బరిలో నిలుస్తున్న సందర్భంలోనూ భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బిఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. ఏడవసారి అభ్యర్థిగా ప్రకటన అనంతరం తొలిసారిగా ఈనెల 26వ తేదీన సిద్దిపేటకు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పార్టీ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి తెలిపారు. 26వ తేదీన మంత్రి హరీష్‌రావును పట్టణ శివారులోని పొన్నాల వై జంక్షన్ నుండి క్యాంపు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, యువజన కమిటీలు, ఆయా విభాగాల వార్డు అధ్యక్షులు, మైనార్టీ, యువత, మహిళ, కార్మిక విభాగం ప్రతి ఒక్కరు హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

# ముదిరాజ్ నుంచి బిఆర్ఎస్‌ను బహిష్కరిస్తున్నాం



గజ్వేల్, ఆగస్టు 24, మనం న్యూస్‌: శాసనసభ సభ్యులుగా ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో ఒక్క ముదిరాజ్ అభ్యర్థి లేకపోవడం చాలా బాధాకరమని, ఇందుకు గాను బిఆర్ఎస్ పార్టీని ముదిరాజ్ సమాజం నుండి బహిష్కరిస్తున్నామని

**-ముదిరాజ్‌లను అవమానించిన బిఆర్ఎస్‌కు బుద్ధి చెప్తాం**

**-మండల ముదిరాజ్ నాయకులు**

మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాజు, యువజన అధ్యక్షులు సురేష్ ముదిరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న ముది రాజ్‌లను సీఎం కేసీఆర్ ఎదగకుండా కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. 2014లో తెరాస ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముదిరాజ్ సమాజం ఎంతో కృషి చేసిందన్నారు. పార్టీలో 10 నుండి 15 మంది ముదిరాజ్ బిడ్డలకు ఎమ్మెల్యే సీటు అర్హత ఉన్నప్పటికీ ఒక్కరికి కూడా టికెట్ కేటాయించకపోవడం అన్యాయమన్నారు. హుజురాబాద్‌లో బుద్ధి చెప్పిన విధంగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బిఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపి పార్టీలు ముదిరాజ్‌లకు టికెట్‌లు ఇవ్వాలని, అలాంటి పార్టీలను వెన్నంటి ఉండి గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం మహిళా అధ్యక్షురాలు జయమ్మ, మండల సర్పంచ్లు బిక్షపతి, మంజుల రమేష్, లక్ష్మి చంద్రం, మండల నాయకులు నర్సింలు, బాలకిషన్, పెద్దమల రాజు, గణేష్, ఎల్లేష్, బాలయ్య, రమేష్, శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ క్రీడల నిర్వహణపై సమావేశం

**-ఎంఈఓ ఉదయ భాస్కర్**



జగదేవ్‌పూర్, ఆగస్టు 24, మనం న్యూస్‌: మండలంలో సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్న ఎస్‌జిఎఫ్ క్రీడల నిర్వహణపై పలు నిర్ణయాలు తీసుకున్నట్లు ఎంఈఓ ఉదయ భాస్కర్ తెలిపారు. గురువారం జగదేవ్‌పూర్ మండల ఎస్‌జిఎఫ్ క్రీడల నిర్వహణకై మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పిఈటిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2 నుండి 4 వరకు నిర్వహించనున్న క్రీడా పోటీల్లో పాల్గొనే వారు ఆగస్టు 31వ తేదీ లోపు ఎంఆర్‌సిలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు గాను ఒక క్రీడాకారుడు కేవలం ఒకే క్రీడలో మాత్రమే పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఏలేశ్వర్‌రావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, రహీమొద్దీన్, మాధవరెడ్డి, రవికుమార్, రజిత తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

**ట్రాఫిక్ సిఐ తిరుపతి**



గజ్వేల్, ఆగస్టు 24, మనం న్యూస్‌: విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే ట్రాఫిక్ నియమాలు తెలుసుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ తిరుపతి అన్నారు. గురువారం రోజున సాయి జి.డి.ఆర్ పాఠశాలలో విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మైనర్‌గా ఉన్నప్పుడు వాహనాలు నడిపితే చట్టపరంగా నడిపిన మైనర్‌లపై, అందుకు ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 18 ఏండ్లు నిండిన వారంతా వాహనాలు నడిపేందుకు చట్టరీత్యా డ్రైవింగ్ లైసెన్స్‌లు పొంది ఉండాలని, రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపినట్లయితే ఎలాంటి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండదన్నారు. ర్యాష్ డ్రైవింగ్ వల్ల మనతోపాటు ఎదుటి వారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని, కావున వాహనాలపై నెమ్మదిగా ప్రయాణించాలని సూచించారు. వాహనదారులు ప్రయాణ సమయంలో వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపరాదని, ఎవరైనా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సోమేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్**



సిద్దిపేట అర్బన్, ఆగస్టు 24, మనం న్యూస్‌: జిల్లా పట్టణ ప్రగతిలో భాగంగా అన్ని మున్సిపాలిటీల్లో చేపట్టిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ కమీషనర్‌లు, మెప్మా, ఇంజనీరింగ్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్ఎస్‌టిపి, దోబిఘాట్, డిఆర్‌సిసి, వైకుంఠ ధామాలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, తెలంగాణ హరితహారం వంటి పనులు సెప్టెంబర్ లోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. నిర్మాణం మొదలు కాని పనులు ఏవైనా ఉంటే, వాటిలో సమస్యలు వస్తే పరిష్కరించుకొని వారంలోపు మొదలు కావాలన్నారు. ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున ఛైర్మన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఈ వీర ప్రతాప్, వందనం, మెప్మా పిడి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చింతా ప్రభాకర్‌కు అభినందనలు తెలిపిన కౌలంపేట్ గ్రామస్తులు



సంగారెడ్డి, ఆగస్టు 24, మనం న్యూస్‌: సీఎం కేసీఆర్ సంగారెడ్డి నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చింతా ప్రభాకర్‌ను ప్రకటించిన సందర్భంగా కంది మండలం కౌలంపేట గ్రామస్తులు గురువారం సంగారెడ్డిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో చింతా ప్రభాకర్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. చింతా ప్రభాకర్‌ను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షఫీ, కంది జెడ్పిటిసి కొండల్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాబా తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు

**-డిఎల్‌పిఓ వేదవతి**



జగదేవ్‌పూర్, ఆగస్టు 24, మనం న్యూస్‌: దుకాణదారులు, ప్రజలు ఆరోగ్యానికి హాని చేకూర్చే ప్లాస్టిక్‌ను వినియోగించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎల్‌పిఓ వేదవతి హెచ్చరించారు. గురువారం జగదేవ్‌పూర్‌లోని పలు దుకాణ సముదాయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ అమ్ముతున్న పలు దుకాణదారులకు జరిమానా విధించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మట్లాడుతూ ప్లాస్టిక్ ద్వారా ఎన్నో రకాల అనర్థాలు జరుగుతున్నాయని, ఎవరూ ప్లాస్టిక్‌ను వాడవద్దని, ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ముఖ్యంగా దుకాణదారులు ప్లాస్టిక్ వస్తువులను విక్రయించరాదని సూచించారు. ఈ కార్యక్రమంఓ సర్పంచ్ లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస్ వర్మ, కార్యదర్శి హరిప్రసాద్; వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితుడికి ఆర్యవైశ్య మహాసభ చేయూత

సిద్దిపేట రూరల్, ఆగస్టు 24, మనం న్యూస్‌: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన నిరుపేద వైద్యుడు కొడిప్యాక నాగరాజు అనారోగ్యం కారణంగా తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ నాయకులు నాగరాజుకు రూ. 17 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్‌లు మాట్లాడుతూ జిల్లాలో నిరుపేద ఆర్యవైశ్యులకు సహకారం అందించడమే కాకుంఆ వైశ్యేతరులకు సైతం వివిధ రకాల సేవలు చేయడం సంతోషకరమన్నారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సమాజంలోని నిరుపేదలకు పుస్తెమట్టెలు అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆయా మండలాల్లో వివిధ రకాల సేవలు అవసరమైన వారికి సంఘం ఆధ్వర్యంలో సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ కోశాధికారి అత్తెల్లి లక్ష్మయ్య, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాడిశెట్టి హేమలత, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పుల్లూరి శివకుమార్, జిల్లా మహిళా విభాగం కోశాధికారి మర్యాల వాణితోపాటు



తదితరులు పాల్గొన్నారు.

# మన్నించు మల్లన్న స్వామి

కొమురవెల్లి, ఆగస్టు 24, మనం న్యూస్ః భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్న శ్రీ కొమురవెల్లి మల్లన్న స్వామి ప్రతిమలు ఆరు బయట పడే యడం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. శ్రీ కొముర వెల్లి మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫోటో స్టూడియోలు నిర్వహించుకొని అందులో మల్లికార్జున స్వామి వారిని నిజరూపంగా తయారు చేసుకొని ఫోటో స్టూడియోలలో ఉంచుతారు. దీంతో అక్కడికి వచ్చే భక్తులు ఆ ప్రతిమలను స్వయంగా మల్లన్న స్వామిగా భావించి జాతరలో మేడలమ్మ, కేతమ్మ మల్లికార్జున స్వామి వారికి తయారు చేయబడిన విగ్రహాల వద్ద భక్తులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగి తీసుకువెళ్తారు. అయితే ఫోటో స్టూడియోలో ఉండాల్సిన విగ్రహాలను కొంతమంది ఆరుబటయ పడేస్తున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచే కొమురవెలిల మల్లన్నను ఆవిధంగా బయట వేయడం చాలా బాధాకరమని ప్రజలు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఎంతో మంది తహసీల్దార్





కార్యాలయానికి వస్తూ వెళ్తుంటారు. కానీ దానికి సమీపంలోనే స్వామి వారి విగ్రహాలు బయటపడేయడం గమనించినా ఎన్నోసార్లు వారికి తెలిపినా కూడా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మల్లన్నకు ఎంతో చరిత్ర కలిగిన స్వామి వారి విగ్రహాలను బయట పడవేయడం మంచిది కాదని, మమ్ములను మన్నించు మల్లన్న స్వామి అని భక్తులు వేడుకుంటున్నారు. ఇప్పటికైనా వారు స్వామి వారిని గుర్తించి స్వామి వారి విగ్రహాలు బయట పడేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



## ఎంపి ప్రభాకర్‌రెడ్డికి ప్రజాప్రతినిధుల సన్మానం

దౌల్తాబాద్, ఆగస్టు 24, మనం న్యూస్ః దుబ్బాక శాసనసభ బిఆర్ ఎస్ అభ్యర్థిగా మొదటి సారి దౌల్తాబాద్ వచ్చిన ఎంపి కొత్త ప్రభా కర్‌రెడ్డికి దౌల్తాబాద్ మండల ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ ఎంపిగా రెండుసార్లు విజయం సాధించగా మరోమారు దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించే బాధ్యత తీఉకుం టామని వారు పేర్కొన్నారు. దుబ్బాకలో బీజేపి , కాంగ్రెస్ పార్టీలకు డిపాజిట్‌లు కూడా దక్కవన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల పార్టీ అధ్యక్షులు రణం శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపిపి అల్లి శేఖర్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు బండారు దేవేందర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పూజిత వెంకట్‌రెడ్డి, దండోరా శివరాజ్, కో ఆప్షన్ సభ్యులు హైమద్, గ్రామాల సర్పంచ్‌లు చిత్తారి గౌడ్, యాదగిరి, ఎంపిటిసిలు వీరమ్మ మల్లేశంతోపాటు తదితరులు పాల్గొన్నారు.



## కార్మికులను పట్టించుకోని గత ప్రభుత్వాలు

### -లేబర్ గుర్తింపు కార్డుల అందజేత

### -ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 24, మనం న్యూస్ః గతంలో పాలించిన ప్రభుత్వాలు కార్మికుల ను, వారి సంక్షేమాన్ని గాలికి వదిలి వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకున్నాయని ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం గజ్వేల్ క్యాంప్ కార్యాలయంలో ప్రజ్ఞాపూర్‌లోని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లేబర్ గుర్తింపు కార్డులను అందించారు. ఈసందర్భంగావారు ఎఫ్‌డిసి ఛైర్మన్‌ను సన్మానించి స్వీట్లు తినిపించారు. అనంతరం ఆయన





మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కార్మికులను విస్మరించాయని, కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు. లేబర్ కార్డు ద్వారా 50 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయించుకునే సదుపాయం ఉంటుందన్నారు. ప్రభుత్వం కార్మికులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. కార్మికులు సాధార ణంగా మరణిస్తే రూ. 1, 30, 000 రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. అదేవి ధంగా ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 6.30 లక్షలు అందిస్తుందన్నారు. కార్మికుల ఆడపిల్లలకు పెళ్లికి రూ. 30 వేలు, ప్రసూతి ప్రయోజనాల కింద మొదటి రెండు కాన్పులకు రూ. 30 వేలు అందిస్తుందన్నారు. లేబర్ కార్డులను ప్రతి భవన నిర్మాణ కార్మికుడు రిజిష్టర్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నవాజ్ మీరా , సీనియర్ నాయకులు ఖాజా విరాసత్ అలీ, కౌన్సిలర్ మరికంటి కనకయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబానికి కర్నాల శ్రీనివాస్‌రావు పరామర్శ

దౌల్తాబాద్, ఆగస్టు 24, మనం న్యూస్ః దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు నగేష్ తండ్రి గొల్లపల్లి లింగయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా గురువారం కాంగ్రెస్ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కత్తి కార్తీక గౌడ్ ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మిద్దె భూపాల్ గౌడ్, ఐరేని సాయితేజ గౌడ్, పెంటం దేవరాజు, యాదగిరి, మల్లేశం, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.





## నాణ్యమైన గొర్రెలు కొనుగోలు చేయాలి



సిద్దిపేట రూరల్, ఆగస్టు 24, మనం న్యూస్‌: నిబంధనలకు అనుగుణంగా గొర్రెలను ఎంపిక చేసి లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీకి గొర్రెలను కొనుగోలు చేసేందుకు వెళ్తున్న నాల్గవ స్పెషల్ కమిటీ అధికారుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుందని, దీని కొరకై గొర్రెలను తీసుకురావడానికి జిల్లా అధికారులతో కూడిన నాలుగవ స్పెషల్ కమిటీ అనంతరం, బళ్లారి వెళ్లనున్నారు. వీరు వారం రోజుల పాటు అక్కడే ఉండి కొనుగోలు కేంద్రాల్లో గొర్రెలను కొనుగోలు చేయనున్నారు. ల్యాబ్ పోర్టర్ రిజిస్ట్రేషన్‌లో పేర్లు వచ్చిన వారిని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని, అధికారులకు ఏవైనా సందేహాలుంటే జిల్లా పశుసంవర్ధక శాఖ హెల్ప్ సెంటర్‌కు కాల్ చేయాలని సూచించారు. లబ్ధిదారులు కొంతమంది గొర్రెలను తీసుకున్న కొంత కాలానికే అమ్మడం జరిగితే చట్టరీత్యా నేరారోపణలు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడి జగత్‌కుమార్‌రెడ్డి, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, సెరీకల్చర్ ఏడి ఇంద్రసేనారెడ్డి, ఏడి మైనింగ్ రాఘవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథను సందర్శించిన నాగాలాండ్ ఐఏఎస్ అధికారులు



గజ్వేల్, ఆగస్టు 24, మనం న్యూస్‌: గజ్వేల్ సమీపంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మిషన్ భగీరథ ప్లాంట్‌ను నాగాలాండ్ రాష్ట్ర ఐఏఎస్ అధికారుల బృందం గురువారం సందర్శించింది. నాగాలాండ్‌కు చెందిన 20 మంది అడ్మినిస్ట్రేషన్ అధికారుల బృందం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ శిక్షణలో భాగంగా మిషన్ భగీరథ ప్లాంట్‌ను సంస్థ డైరెక్టర్ జనరల్ డా. శశాంక్ గోయల్ ఆదేశాల మేరకు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీర్ రాజయ్య మిషన్ భగీరథ ప్లాంట్ రూపకల్పన, యంత్రాల పనితీరు, నీటి సరఫరా, నీటి స్వచ్ఛత వంటి అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈఈ నాగార్జున తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం చేపడుతున్న పథకాలు ఎంతో అభినందనీయమన్నారు.



# కాంగ్రెస్‌తోనే ప్రజలకు సమన్యాయం

### -బీజేపి, బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు

### -కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్, ఆగస్టు 24, మనం న్యూస్‌: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బీజేపి, బిఆర్ఎస్ యువకులు సుమారు 30 మంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బొప్పాపూర్‌లో జరిగిన ఆత్మగౌరవ యాత్ర సభలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈస ందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపి, బిఆర్ఎస్‌లు





రెండు తోడు దొంగలన్నారు. దుబ్బాకలో వచ్చే ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ పార్టీ అని, పార్టీకి ప్రజలందరూ పట్టం కట్టడానికి ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి తప్ప తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పార్టీలో చేరిన వారిలో నాగస్వామి, మహేష్, కరుణాకర్, ప్రశాంత్, భరత్, టి. భరత్, రాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పడాల రాములు, ఏఎంసి మాజీ ఛైర్మన్ కనకయ్య , గొడుగుపల్లి మాజీ ఎంపిటిసి మద్దెల స్వామి, లాలు, భద్రయ్య, లింగం, పంజా రమేష్,నవీన్, శివ, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలను మోసం చేస్తున్న కేసీఆర్

### -యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్



గజ్వేల్, ఆగస్టు 24, మనం న్యూస్‌: గత ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్ మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి పదేళ్లు గడుస్తున్నా ఇంత వరకు రిజర్వేషన్‌పై స్పందించకుండా మైనార్టీలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నాడని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ అన్నారు. గురువారం సర్దార్ ఖాన్‌మిర్జా జమీల్ బేగ్, మున్నాలు విలేకర్లతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ రాజకీయాల్లో మైనార్టీలకు తక్కువ చూపు చూస్తుందని, ఓడిపోయే తమ మిత్రపక్షమైన ఎంఐఎం పరిధిలో రెండు ఎమ్మెల్యే సీట్లు కేటాయించడం చూస్తేనే మైనార్టీలంటే కేసీఆర్‌కు , టీఆర్ఎస్‌కు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. గత కాంగ్రెస్ హయాంలో వైఎస్ఆర్ మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చి ఎంతో మంది విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కల్పించారన్నారు. కానీ తెరాస ప్రభుత్వం రంజాన్ తోఫాలు ఇచ్చి చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. మైనార్టీ మిత్రులంతా ఒకసారి ఆలోచించి కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వారు సూచించారు.

### ఈనెల 27న సిద్దిపేటలో

## మెగా డ్రోన్ షో

సిద్దిపేట, ఆగస్టు 24, మనం న్యూస్ ప్రతినిధిః అన్ని రంగాల్లో ముందుండి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట మరో అపూర్వ ఘట్టంతో మహానగరాల సరసన చేరనుంది. ఈనెల 27వ తేదీన కోమటి చెరువుపై సాయంత్రం 6 గంటలకు 450 డ్రోన్ కెమెరాలతో ఆకాశంలో కాంతి వెలుగులు వెదజల్లనున్నాయి. మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవతో మెగా డ్రోన్ షో నిర్వహించనున్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి సిద్దిపేట కోమటి చెరువు వేదిక కానుంది.




## బీజేపి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

### షోలాపూర్ సౌత్ ఎమ్మెల్యే సుభాష్‌చంద్ర దేశ్‌ముఖ్

దౌల్తాబాద్, ఆగస్టు 24, మనం న్యూస్‌: వచ్చే ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో బీజేపి పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని షోలాపూర్ సౌత్ ఎమ్మెల్యేసుభాష్‌చంద్ర దేశ్‌ముఖ పిలుపునిచ్చారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం దౌల్తాబాద్ మండల బీజేపి నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్ధేశం చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో మరోసారి బీజేపి జెండాను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని, మండల వ్యాప్తంగా బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇంచార్జ్‌లు ప్రతి గడప గడపకు తిరిగి బీజేపి అమలు చేస్తున్న పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న అన్యాయాలను, అక్రమ పాలనను ప్రజలకు వివరించి బిజేపి ప్రభుత్వం ఏర్పడాల్సిన ఆవశ్యకతను వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చారి, మండల పార్టీ అధ్యక్షులు కిషన్, ఉపాధ్యక్షులు గడ్డమీదిస్వామి, మాజీ అధ్యక్షులు కుమ్మర నర్సింలు, జిల్లా అధికార ప్రతినిధి కౌకూరి యాదగిరి, నాయకులు భూపాల్‌రెడ్డి, రామస్వామి గౌడ్, నరసింహారెడ్డి, యాదగిరి, కనకరాజుతోపాటు పాల్గొన్నారు.

## ముచ్చటగా మూడోసారి ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

### -ఎమ్మెల్సీ యాదవరెడ్డి



గజ్వేల్, ఆగస్టు 24, మనం న్యూస్‌: సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయ డం ఖాయమని ఎమ్మెల్సీ యాద వరెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధిస్తూ దేశంతోపాటు ప్రపంచ దేశాలు తెలంగాణ వైపు చూస్తున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయకేతనం ఎగురవేసి ముచ్చటగా మూడోసారి బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. మెదక్‌లో నిర్వహించిన బహిరంగ సభలో లక్షకు పైగా ప్రజలు హాజరయ్యారని, సీఎం కేసీఆర్ రైతుబాంధవుడని కొనియాడారు. సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రాబోయే ఎన్నికల్లో గజ్వేల్ నుండి లక్షకు పైగా మెజార్టీతో సీఎం కేసీఆర్ గెలుపు ఖాయమన్నారు.